క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన కె.కె.రాజు



సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం గాజువాకలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కలిసి.. పలు అంశాలపై మాట్లాడారు.

సంక్షేమాభివృద్ధిని చూసి ఆదరించండి



కళింగ వైశ్య ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

మద్రిపాలెం: తనను ఆదరించి సార్వత్రిక ఎన్నికల్లో విజయాన్ని అందించాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కోరారు. మద్రిపాలెం వుడా కల్యాణ మండపంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళింగ వైశ్య సేవా సంఘం ప్రతినిధి తాళాసు సాయిమోహన్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చేశామని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించామని తెలిపారు. సంక్షేమాభివృద్ధిని చూసి తనను గెలిపించాలని కె.కె.రాజు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, పార్టీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, అమర్‌రెడ్డి, సంఘ అధ్యక్షుడు లాడి సత్యం, వారణాసి వెంకటరమణ, జామి శశి, విశాఖ యువజన చైతన్య సేవా సంఘం సెక్రటరీ బోగి ప్రవీణ్‌కుమార్, పాట్నూరు సతీష్, వారణాసి రమేష్, బోయిన భగవాన్, మహిళలు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయాల్లో కె.కె.రాజు పూజలు



బాపూజీనగర్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 48, 47 వార్డుల్లోని కంచరపాలెం బర్మాక్యాంప్, న్యూ బాపూజీనగర్ ప్రాంతాల్లో నూకాలమ్మ అమ్మవారి నెల పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఆయా ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను కె.కె.రాజు తిలకించారు.

డెవలప్‌మెంట్ వాచ్

గెడ్డల ఆధునికీకరణ



వాసుదేవనగర్‌లో అభివృద్ధి చేసిన గెడ్డ



నాగన్న గెడ్డకు నిర్మించిన రక్షణ గోడలు



తాటిచెట్లపాలెం హైవే పక్కన ఆధునికీకరించిన గెడ్డ



రైల్వే న్యూకాలనీ జంక్షన్ వద్ద ఆధునికీకరించిన గెడ్డ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉత్తర నియోజకవర్గంలో ఐదేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. వార్డుల్లో మరింత చురుగ్గా అభివృద్ధి జరిగింది. ఇందులో భాగంగా జీవీఎంసీ 42, 45 వార్డుల్లోని గెడ్డల రూపురేఖలు మారాయి. రైల్వే న్యూకాలనీ గెడ్డను సుమారు రూ.48 లక్షలతో, నాగన్న గెడ్డను రూ.39 లక్షలతో, తాటిచెట్లపాలెం గెడ్డను రూ.11 లక్షలతో, వాసుదేవనగర్ గెడ్డను రూ.32 లక్షలతో అభివృద్ధి చేశారు. ప్రమాదకరంగా ఉన్న గెడ్డలకు బాటం కాంక్రీట్, రక్షణ గోడలు నిర్మించి ఆధునికీకరించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుతో కృషితో అభివృద్ధి పనులు జరిగాయి.

– తాటిచెట్లపాలెం

సైనికుల్లా పనిచేద్దాం.. వైఎస్సార్‌సీపీని గెలిపిద్దాం

పార్టీ శ్రేణులకు కె.కె.రాజు పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుడిలా పని చేయాలని పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపునిచ్చారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఎన్నికలకు ఇంకా ఆరు రోజులు మాత్రమే సమయం ఉందని, ప్రతి ఒక్కరూ ఇంటింటికీ వెళ్లి మన పార్టీ ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు **వివరించి** ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీని **అత్యధిక** మెజారిటీతో గెలిపించేలా చూడాలని **కోరారు.** కార్యక్రమంలో పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, సీనియర్ నాయకులు వుడా మాజీ చైర్మన్ రవి, మాజీ కార్పొరేటర్ జి.వి.రవిరాజు, భరణికాన రామారావు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో యువత చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన బాపూజీనగర్ యువతతో ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు 47వ వార్డు బాపూజీనగర్‌కు చెందిన యువత మద్దతు పలికారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అమర్‌నాథ్ ఆధ్వర్యంలో మంగళవారం బాపూజీనగర్ మెగా బాయ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు పార్టీలో చేరారు. వారికి కె.కె.రాజు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తాను నాయకుడిలా కాకుండా.. ఓ అన్నలా యువత అందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, సిక్కు కార్పొరేషన్ చైర్మన్ ఆనంద్ సింగ్, మాజీ కార్పొరేటర్ జి.వి.రవిరాజు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత అల్లూరి



సీతమ్మధారలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



ఈస్ట్ పార్క్‌లో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరాజు, వంశీకృష్ణ వర్మ



మురళీనగర్‌లో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

సీతమ్మధార: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతి సందర్భంగా మంగళవారం సీతమ్మధార జంక్షన్‌లోని అల్లూరి విగ్రహానికి రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు అందరికీ స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమని పేర్కొన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి తన ప్రాణాలర్పించిన యోధుడు అల్లూరి అని కొనియాడారు. అనంతరం అల్లూరి జంక్షన్‌లో గొల్ల బాబూరావు, కె.కె.రాజు చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు, క్షత్రియ పెద్దలు పాల్గొన్నారు.

విప్లవజ్యోతి అల్లూరికి ఘన నివాళి

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు ఈస్ట్ పార్కులోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు సిహెచ్.శ్రీనివాసరాజు, యూనివర్సల్ యూత్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు చింతలపాటి వంశీకృష్ణ వర్మ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామ పోరాటంలో అల్లూరి పాత్ర మరువలేనిదన్నారు. మన్యం ప్రజల హక్కులు, శ్రేయస్సు కోసం ప్రాణ త్యాగం చేసి ప్రపంచం నలుమూలలా రాష్ట్ర కీర్తిప్రతిష్ఠలను వ్యాప్తి చేసిన ఘనత అల్లూరిదేనని కొనియాడారు.

వాకర్స్ క్లబ్ సభ్యుల నివాళి

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి మాట్లాడుతూ అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు పేదల హక్కుల కోసం చేసిన పోరాటం అజరామరమన్నారు. క్లబ్ పూర్వాధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి, ఎం.నారాయణరావు, బి.సూర్యనారాయణ, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, పూర్వాధ్యక్షులు ఆర్.సత్యనాథం, కె.జి.కృష్ణారావు, కె.ద్వారకానాథ్, సత్తి సునీల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎ.వి.సుబ్బారావు, కార్యదర్శి పి.చెల్వరాజు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, మహిళా వాకర్స్ క్లబ్ పూర్వాధ్యక్షురాలు కె.మాధవి, కార్యవర్గ సభ్యుడు ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటేసిన పోలీసులు



సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొన్న పోలీసులు

సీతమ్మధార: ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఉత్తర నియోజకవర్గంలో నిర్వహించిన పోలీసుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. ఉత్తర ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్వో) డి.అఖిల సమక్షంలో ఓటింగ్ నిర్వహించారు. మంగళవారం సీతమ్మధార ఆర్వో కార్యాలయంలో 249 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. రెండో రోజు బుధవారం మరో 100 మంది పోలీసులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయనున్నారు. హోమ్ ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి దివ్యాంగులు, వృద్ధులు కలిపి 249 ఓట్లకు గానూ 241 మంది ఓట్లు నమోదు చేశారు. మిగతా 8 మంది బుధవారం వేయనున్నారు.

కె.కె.రాజుకు మదర్ ఇండియా ట్రస్టు మద్దతు



మద్దతు తెలుపుతున్న మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్టు కార్యవర్గం

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్టు కార్యవర్గం, సభ్యులు వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు మద్దతు తెలిపారు. సంస్థ కార్యాలయంలో మంగళవారం ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు మళ్ల వెంకటరావు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో కె.కె.రాజు ఓడినప్పటికీ నిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరిస్తూ, ప్రతి వార్డులో అభివృద్ధి పనులు, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. ఐదేళ్లలో ప్రతి గడపనూ మూడు సార్లు సందర్శించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించారని చెప్పారు. ప్రజల కోసం అనుక్షణం శ్రమించే కె.కె.రాజు స్వయంగా మూడు సార్లు ట్రస్టు కార్యాలయానికి వచ్చి మద్దతు కోరినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి కె.కె.రాజును గెలిపించాలని తీర్మానించారు. దీనికి కార్యవర్గ సభ్యులు, ట్రస్టులోని 180 కుటుంబాలు కె.కె.రాజుకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించాయి. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు బండే వెంకటేశ్వరరావు, ఆల్ ఇండియా పోర్టు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కందాల ప్రభాకరరావు, ఎన్జీజీవోస్ కాలనీ అధ్యక్షుడు తణుకు సీతారామయ్య, సత్యారావు, జనార్దన్‌రెడ్డి, రాజు, శ్యామల, లక్ష్మి, అశ్విని, మళ్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పర్వం



వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజులను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరుతూ మంగళవారం 50వ వార్డు వంశీనగర్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి

– మద్రిపాలెం



ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి బొత్స ఝాన్సీ, కె.కె.రాజులను గెలిపించాలని అభ్యర్థిస్తూ 53వ వార్డు శివనగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి

– మద్రిపాలెం



ఏనుగు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరుతూ 54వ వార్డు రెడ్డికంచరపాలెం, వివేకానంద వీధి, శ్రీనగర్, దేవేంద్రనగర్ ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం చేస్తున్న బహుజన్ సమాజ్ పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దాడ కనకమహాలక్ష్మి

– కంచరపాలెం



సీతమ్మధార టీపీటీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జైభారత్ పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీనారాయణ

– సీతమ్మధార